# నిక్‌నేమ్

**పొ**ద్దున్న అయిదు గంటలకి బయల్దేరిన కామేశం ఇంటికొచ్చేసరికి ఏడు గంటలయింది. రోజూ వాకింగ్‌కి వెళ్ళి తిరిగి , తిరిగి ఒక గంటలోపులో తన వాకింగ్‌పూర్తి చేసుకుని ఇంటికొచ్చేస్తాడు.

"వస్తూనే, కాంతం! నాకు కాఫీ ఇచ్చెయ్యి, చాలా నీరసంగా వుంది! అన్నాడు.

"ఎందుకంత నీరసం" అంటూ లోపల్నుంచి వచ్చింది కాంతామణి.

"ఎందుకేమిటి? డయాబిటిస్ వాణ్ణికదా. మరి నీరసం ఉండదా!

"ఈరోజు చాలా నడిచినట్లున్నారే!

"అవును మరి, ఈరోజూ అబ్బో! రెండు గంటల నడక సామాన్యమా!"అన్నాడు కామేశం.

"అవునా? ఉదయం ఇల్లు వదిలినప్పట్నుంచీ నడకే నడకన్నమాట?" వ్యంగ్యంగా అడిగింది.

"ఏం నీకెందుకంత సందేహం!"

"సందేహం లేదు మీరు ఎంత నడిచారో రూఢిగానే తెలుసు. మీరు కాలనీలో వాకింగ్‌కి అని వెళ్ళి అలా అమీర్‌పేట్ వైపెందుకు వెళ్ళారు. ఆ చర్మాస్ షాపు దగ్గర మిత్రో పాటు మెట్ల మీద కూర్చున్నాయనెవరు!

పైగా అక్కడ పేపర్ చదువుతూ ఏదో చర్చిస్తున్నారట కదా!" అంది కాంతం ఆరా తీస్తూ.

"ఓ ఆదా! వాడు మా ఆఫీసులోనే పనిచేస్తున్నాడు. అతని భార్య ఊర్నుంచి బస్సులో వస్తుందని ఒక్కడూ ఉండలేక, కాస్త రూట్ మార్చి బస్టాండ్‌కి రా! నీ షుగర్‌కి డబుల్ వాకింగ్ మంచిదేలే. ఎటూ పొద్దున్నే వాకింగ్‌కి బయల్దేరతావు కదా!" అన్నాడని చెప్తూ, అసలీ సిఐడి ఆఫీసర్ కూతుర్ని పెళ్ళి చేసుకోవడమే తను చేసిన పెద్ద పొరపాటు. ఈవిడకి చంద్రకాంతం అని పెట్టారు గాని, సూర్యకాంతం అంటే కరెక్టుగా సరిపోయేది అనుకున్నాడు స్వగతంగా.

కాంతాన్ని ఎలాగో సంతోషపెట్టకపోతే లాభం లేదని "అవును కాంతం! "ఆమ్రేడితం" అంటే ఏమిటని అడిగాడు మా మిత్రుడు" అన్నాడు కామేశం.

"మీరెం చెప్పారు!"

"మా ఆవిణ్ణి అడిగి చెపుతానన్నాను". భర్త చాలా బుద్ధిమంతుడని బొల్డు సంతోషించింది కాంతం. ఏ విషయమైనా అందునా ముఖ్యంగా తెలుగుభాష గురించి " మా ఆవిడ్ని అడిగి చెపుతాను" అంటే కాతం, కనకం లభించినంత ఆనందిస్తుంది.

అయినా కామేశం చిన్నప్పట్నుంచి ఏ విషయం రూఢీగా చెప్పేవాడు కాదు. చిన్నప్పుడైతే "మా అమ్మని అడిగి చెపుతా" ననేవాడు ఇప్పుడేమో "మా ఆవిడ్ని అడిగి చెపుతా" నంటున్నాడు. ఇంతకు మించి తేడా ఏమీలేదు. అతగాడేమీ పెద్ద భాషా శాస్త్రజ్ఞుడేం కాదు.

"ఆమ్రేడితమంటే రెండుమూడుసార్లు చెప్పబడిన పదం. ఎక్కువగా చేయబడినది అని అర్థం. ఈసారెవరైనా, ఏదైనా అడిగితే అసహ్యంగా మా ఆవిణ్ణి అని కాకుండా, మా కాంతామణిని అడుగుతాననండి" అంది కాంతం.

'నీపేరు చెప్పడం ఎందుకని నేనలా చెప్పటం లేదు" అన్నాడు కామేశం నసుగుతూ.

"ఓసి మీ ఇల్లు బంగారం గానూ! కాంతం అంటేనే భార్య అని అర్థం. ఏం మనుషులో! ఏమో! మాతృభాష తెలియదు. పరాయిభాష వంటపట్టదు, ఖర్మ" అనుకుంది.

తెలుగు తనకంటే ఎక్కువ తెలుసున్నట్లు కనిపిస్తే కాంతం, కారాలు మిరియాలు నూరుతుంది. మొత్తం మీద ఇవాళ యీ భార్యా బాధితుడికి అమీర్‌పేట గండం గడిచింది అనుకున్నాడు.

ఆఫీసులో అడుగుపెట్టగానే కామేశంని పక్కకు పిలిచి "ఏమిటయ్యా బాబూ! పొద్దున్న ఆరుగంటలకే అమీర్‌పేట చర్మాస్ దగ్గర నువ్వూ, మన ఉమాపతి కూర్చున్నారు. మిమ్మల్ని పోల్చుకునే సరికి నేనొస్తున్న బస్సు బయల్దేరిపోయింది. సరే, చేసేది లేక నేరుగా మీ ఇంటికి వచ్చేశాను. నువ్వెంతకీ ఇంటికి రాలేదు. నేనొచ్చినట్లు సోదరి కాంతం గారు చెప్పే ఉంటారు" అన్నాడు ఆనందరావు.

ఓహో నువ్వా చిట్టితండ్రీ! ఈ అమీర్‌పేట విషయం మా ఇంట్లో చెప్పింది అనుకుంటూ "అంత పొద్దున్నే నాతో ఏం పని పడింది" అనడిగాడు కామేశం.

"ఏం లేదు వెయ్యి రూపాయలు అర్జంటుగా కావలసి వచ్చాయి" అన్నాడు ఆనంద్. ఇతరులకి బాధ కలిగించే నీకు ఆనంద్ అని ఎందుకు పేరుపెట్టారో! పేరుకు రావు తగిలించారు కూడా. అది కరెక్ట్ 'ఆనందాలురావు' అందుకే మరి! అంతా నెగటివ్ ఆలోచనలే! అసలీ అమీర్‌పేట్ విషయం చెప్పకపోతే తప్పకుండా అప్పిచ్చేవాణ్ణి అనుకుని, "నెలాఖరు కదా నా దగ్గర కూడా డబ్బులేదు' అన్నాడు కామేశం.

"ఎప్పుడెంత డబ్బు కావాలంటే అంత డబ్బూ ఇచ్చే ఈ కామేశంగాడికి ఏం పుట్టిందో!" అనుకున్నాడు ఆనందరావు.

ఆ సాయంత్రమే కామేశంతో చిన్నప్పుడు చదువుకున్న శంకరం, చుట్టాలింట్లో పెళ్ళికని షోలాపూర్ నుంచి వచ్చి, కామేశాన్ని చూడ్డానికి వచ్చాడు. కాలింగ్ బెల్ కొడుతూ కామేశంగాడు వస్తాడేమో ఒక జెల్ల కొడదామనుకుంటే, కామేశం బదులు అతని కాంతామణి వచ్చింది.

"హలో! మీరా అన్నయ్యగారూ!" రండి రండి అని, సాదరంగా లోపలికి ఆహ్వానించింది.

"చెల్లెమ్మా! బాగున్నావా! మా కామేశం గాడు లేడా!" అనడిగాడు.

"ఇంకా 'మా' అనే అంటున్నారే! మా పెళ్ళవక ముందు మీ కామేశం, మా పెళ్ళైన తర్వాత మన కామేశం అన్నయ్యగారూ అంటూ, ఆయన 'మార్నింగ్ వాక్'కి వెళ్ళారు. ఆయనకి డయాబిటిస్ వచ్చింది' అంది కాంతామణి.

"ఈ మార్నింగ్ వాక్ ఏమిటా అని ఆశ్చర్యపోతూ, దీని విషయం తర్వాత చూద్దామని, "అసలీ డయాబిటిస్ ఎప్పట్నుంచి?" అన్నాడు శంకరం. ఒక సంవత్సరం బట్టి మీకు చెప్పలేదా అన్నయ్యగారూ?" చెప్పి ఉండరు లెండి. మీరు బయోకెమిస్ట్రీలో డాక్టరేట్ కదా. ఏమేమి జాగ్రత్తలు తీసుకోవాలో చెప్తారని భయం" అంది.

"మరి డయాబిటిస్ అయితే వ్యాయామం బాగా చెయ్యాలి. బాగా నడుస్తున్నాడా!"

"ఏదో మా కాలనీలోనే నడుస్తున్నారు. పొద్దున్నే టి.విలో వచ్చే భక్తి

కార్యక్రమాలు వినడం లేదనీ, న్యూస్ పేపర్లు చదవడం కుదరడం లేదని, అస్తమానూ ఒకటే బాధపడుతూ, నడుస్తారు. అందుకే దాన్ని 'మౌర్నింక్ వాక్' అన్నాను. మౌర్నింగ్ అంటే ఇంగ్లీషులో ఏడవడమనే కదా అర్థం, అన్నయ్యగారు" అంది కాంతామణి అమాయకంగా.

"అదీ... అదీ.." శంకరం ఎలా చెప్పాలా అనుకుంటూంటే కామేశం చిన్న సంచితో ఇంట్లోకి రానే వచ్చాడు. "ఏమిట్రా కాముడు, ఆ సంచీ ఏమిటి చేతులో? ఏమైనా సరుకులా? పొద్దున్నే నడవడానికి వెళ్ళినవాడవు ఆ సంచీతో ఎందుకు తిరుగుతున్నావు!" అన్నాడు శంకరం.

"ఏముందిరా! ఎంతసేపయింది నువ్వొచ్చి! కాఫీ తాగావా. అంటూ మా ఇద్దరికీ కాఫీపట్రా" అని కాంతానికి పురమాయించాడు.

"నేను వచ్చి చాలా సేపయింది. ఏమిట్రా నీకు డయాబిటిస్ వచ్చిందట. నీ మరాథాన్ వాకింగ్‌తో దెబ్బకు కంట్రోలయిపోతుందిలే" ఫరవాలేదు"

"ఆ ఏం వాకింగ్ ఏమిటో! ఇవ్వాళ వాకింగ్‌లో ఒకరితో గొడవపడ్డాను. నీకు జ్ఞాపకం ఉందిరా...! మా బామ్మ కిరాణ సామాన్లేమైనా తెమ్మని చెప్పి ఆ జాబితా వల్లె వేసుకుంటూ షాపుకి వెళితే మరచిపోమని చెప్పేది? ఆ చిన్నప్పటి అలవాటు ఇప్పటికీ నాకుపోలేదు. ఈకాంతం పొద్దునే ఏవేవో కిరాణా సామాన్లు తెమ్మని పురమాయిస్తుంటుంది. నిన్న చెప్పిన సరుకుల్లో నూనె, బెల్లం తీసుకువచ్చాను. కాని ఆ షాపులో చింతపండు అయిపోయింది. ఈరోజు పార్కులో "చింతపండు", "చింతపండు" అనుకుంటూ నడుస్తున్నాను. నా ముందు ఓ జంట నడుస్తున్నారు. ఆయన, ఆ చింతపండు అన్న మాట విని మండిపడ్డాడు.

"ఏం ఏమైనా వేళాకోళంగా ఉందా! అసలు నాకు "చింతపండు" అనే నిక్‌నేమ్ ఉందని ఎలా తెలుసు నీకు! ఏ కాలేజీలో చదివావు! మా కాలేజీలో నన్ను ఏడిపించుకు తినేవారు. అయిందేదో అయిపోయిందని, నేను హాయిగా బతుకుతుంటే నన్ను 'చింతపండు' అని మళ్ళీ తగులుకుంటావా! అదీ నా భార్య ముందు ఎగతాళి చేస్తావా, అని గట్టిగా కేకలు వేశాడురా!"

"ప్చ్! పాపం! మరెలా బయటపడ్డావురా ఆ గొడవలోంచి" అడిగాడు మిత్రుడు.

"కేవలం అదృష్టం రా! నేను రోజూ మా కాలనీ పార్కులో నడుస్తుంటాను. అక్కడే రోజూ నడిచే ఒక రిటైర్డ్ ఇంజనీర్ "ఈయన ప్రతీనెలా మొదటి వారంలో వివిధ రకాల కిరాణా సామాన్లు అనుకుంటూ నడుస్తాడు. చాలా రోజుల్నుంచి ఈయన్ని చూస్తున్నాను. అయినా మీకా నిక్‌నేమ్ ఉందని ఈయన కెలా తెలుస్తుంది పాపం! కొంతమంది కొనవలసిన సరుకులు మరచిపోకుండా అలా అనుకుంటారు" అని సర్దిచెప్పాడు. ఆ చింతపండుగాడు మొదటిసారి పార్కుకి వచ్చాడేమో, ఆ ఇంజనీర్ మాటలు నమ్మాడు" నిట్టూర్చాడు కామేశం.

"మొత్తం మీద చాలా అవస్థపడ్డావన్నమాట. ముసిముసిగా నవ్వుతూ, గమ్మత్తుగా అడిగాడు శంకరం.

"అవస్థ అని మెల్లగా అంటున్నావా! ఈ డయాబిటిస్ వల్ల టీవిలో వచ్చే మంచి భక్తి కార్యక్రమాలు పోతున్నాయి. పేపర్లు సరిగ్గా చదవటానికి వీల్లేదు. మధ్యలో యీ 'చింతపండు' వంటి వాళ్ళ వల్ల గొడవలు, అయినానేనేం చెయ్యానురా! ఇంకొకడికి 'హార్లిక్స్‌సీసా" అనో, సిలిండరనో నిక్‌నేమ్ ఉందనుకో! వాళ్ళు తంతారు. ఇక ఈ వాకింగ్ మానేస్తాన్రా" అన్నాడు కామేశం నిరాశగా.

"అది అసలు కుదరదు! కావలిస్తే సరుకులన్నీ నేనైనా తెచ్చుకుంటాను! మీరు మాత్రం వాకింగ్ మానేస్తే నా మీద ఒట్టే! అని మంగళ సూత్రాలు కళ్ళకద్దుకుంది కాంతం.

"ఏమిటిరా! ప్రతీవాళ్ళూ ఆకుకూరలు తినమని, స్వీట్లు తినొద్దని, ఆలోచనలూ, ఆందోళనకర విషయాలు పక్కనపెట్టమని, వాకింగ్ మాత్రం ఛస్తే మానొద్దనీ చెపుతున్నారు. అయినా చచ్చినవాడసలు ఎలా నడుస్తాడో నీవే చెప్పరా!" అన్నాడు కామేశం.

"ఏం బాధపడకు! అసలు ఆ చింతపండుగాడి వల్లే ఇంత రాద్ధాంతమయింది!"

"అలా చెప్పండి అన్నయ్యగారూ!. ప్రతీ చిన్న విషయానికీ బాధపడతారు. ఎవడో పాత చింతపండుగాడేదో గొడవపెట్టాడని అసలు వాకింగ్ మానేయడమేమిటి?" అంది కాంతామణి.

పొద్దున్నే ఆ కాస్సేపయినా, కాఫీ పురమాయింపులు, ఏమే, ఒసే ఇది

విన్నావా? చూశావా? పిలుపులు తగ్గుతాయని ఆవిడ ఆశ.

ఎలాగూ మిత్రుడు పక్కనే ఉన్నాడన్న ధైర్యంతో, " అ నువ్వు మాత్రం కనీసం అప్పుడప్పుడైనా పంచదార కాఫీ తాగనివ్వవు, స్వీట్లడబ్బాపైన "మిరకాయలు" అని రాయడం, అన్ని రకాల పళ్ళు నా ఎదురుకుండానే తినడం బాగుందా?" అని గట్టిగా అరిచాడు భార్యపైన.

పైగా, "ఏరా! నువ్వే చెప్పరా. నేను చిన్నప్పట్నుంచి ఏమైనా దొంగ పన్లు చేశా్రా. ఎవ్వరికీ తెలియకుండా స్వీట్లు అవీ దొంగతనంగా తినేవాణ్ణిరా. అని శంకరాన్ని సాక్ష్యం అడిగాడు.

"కూల్‌డౌన్! కూల్‌డౌన్! కాముడు. ఏమిటిది?" అంటూ టాపిక్ మారుద్దామని "అవున్రా కాముడూ! మన కాలేజీలో "మామిడి అల్లం" అనే నిక్‌నేమ్‌తో ఒక అమ్మాయి ఉండేది, నీకు జ్ఞాపకం ఉందిరా! అన్నాడు శంకరం.

"ఉంద్రా బాబు అసలు ఈ చింతపండుగాడి గొడవతో, నాకింకా గుండె దడ తగ్గలేదు. మళ్లీ ఈ మామిడి అల్లం ఒకటా!" భార్యకేసి ఓరగా చూస్తూ, గుండెమీద చెయ్యి వేసుకున్నాడు కామేశం.

"నిక్‌నేమ్స్ పెట్టే ముందే ఏమైనా గొడవలొస్తాయేమో ఆలోచించాలి. గొడవలొస్తాయన్న భయమున్నవాడవు అసలా అమ్మాయికి 'మామిడి అల్లం' అని నిక్‌నేమ్ ఎందుకు పెట్టావు?" అన్నాడు శంకరం, అదేదో కొత్త విషయంలా.

"బాగుంది వరస. కాంతం నిజంగా , నేనే ఆ నిక్‌నేమ్ పెట్టాననుకుంటుంది. లేని పోనిరభస- బాగా జ్ఞాపకం చేసుకో. నువ్వే కదరా ఆ అమ్మాయికి మామిడి అల్లం ఛాయ అని ఆ పేరు పెట్టింది".

"మా చెల్లాయి నిన్నేమనుకోదులే! అన్నట్టు గుర్తొచ్చింది, ఆమధ్య ఎవరో చెప్పారా! మామిడి అల్లం తింటే షుగరు తగ్గుతుందని. ట్రై చేసి చూడు" అన్నాడు మిత్రుడు.

"ఓహో! కాలేజీ రోజుల్లో అమ్మాయిలకి నిక్‌నేమ్స్ పెట్టి, వాళ్ళని ఏడిపించేవారన్నమాట! అయితే మా ఫ్రెండ్ ప్రేమలతకి "మామిడి అల్లం" అన్న పేరు పెట్టింది మీరేనా స్వామీ! సాధు జనాన్ని ఉసురు పెడితే ఊరికే పోతుందా

మహానుభావా! ఆ ప్రేమలత ఉసురే, ఈరోజు ఈ చింతపండు రూపంలో వచ్చి చెడామడా పెట్టింది. మా బాగా అయ్యింది'' అంది కాంతామణి.

''అదేం లేదులే సిస్టర్. ఓ విధంగా వీడు అమాయకుడు ఒక్క నిక్‌నేమ్‌ల విషయంలో తప్ప, దానికీ ఏం ప్లానుండదు. అప్రయత్నంగా అనేస్తూంటాడు. వాడి అదృష్టమో, దురదృష్టమో అవి కరెక్టుగా సరిపోతాయి. అంతే'' సమర్థించాడు శంకరం.

''ఓహో! కాలేజీలో చాలా వ్యవహారాలే నడిచాయన్నమాట'' అంది కాంతం కోపంలో జీవిస్తూ.

''అబ్బే! అదేం లేదు. చెప్పానుగా అమాయకుడని. స్వ పర భేదం లేదు, పాపం!. అంతవరకూ ఎందుకు? పెళ్లైన కొత్తలో నీక్కూడా గుమ్మడి పండు అని నిక్‌నేమ్ పెట్టి, నేను పెట్టిన పేరు సరిగి సరిపోయింది కదురా మా ఆవిడకి అని మమ్మల్ని అడిగేవాడు అంటూ సెల్ ఫోన్ మోగడంతో, ఆ వంకన ''హలో'' అంటూ బైటికి జారుకున్నాడు, శంకరం.

హర్నీ! ఎంత పనిచేశావురా? నన్ను అగాధంలోదింపేసి, ప్రమాద పరిస్థితుల్లో వదిలేసి, వెళ్ళిపోతావా, అంటూ బేజారైపోయాడు కామేశం వీధి గుమ్మంవైపు చూస్తూ.

''ఆహా! మీరింతటి వారన్నమాట. ఆఖరికి సొంతభార్యకి నిక్‌నేమ్ పెట్టారన్న మాట. అనుకుంటూనే వున్నా'' అది కాంతామణి కళ్ళు పెద్దవిచేసి.

''చిన్న సవరణ కాంతం. సొంత అనక్కర్లేదు . భార్య అంటే చాల్లే!'' అన్నాడు కామేశం, అంత సిరీయస్ సిట్యుయేషన్‌లోనూ.

''భాష వియం తర్వాత చూద్దాం. అసలు నేను గుమ్మడి పండు లా ఉ న్నానా? ముందు అది చెప్పండి'' నిలదీసింది.

''అదేమిటి కాంతం. వాడేదో అన్నాడని నామీద విరుచుకుపడుతున్నావ్. అసలు చిన్నప్పట్నుంచి అబద్ధాలు చెప్పడం అలవాటు వాడికి. అబద్ధం చెప్పడం వల్లే దొంగలా బైటికి ఉడాయించాడు'' గాంభీర్యం నటించాడు కామేశం.

''సర్లెండి మీ మిత్రుడు మళ్లీ వస్తాడు కదా. అప్పుడు అసలు విషయం తేలుస్తాను''.

''అదేమిటి కాంతం మన పెళ్లై పదేళ్ళు అయింది కదా. ఇంకా నామీద

నమ్మకం కుదర్లేదా నీకు. ఎప్పుడైనా నిన్నేమైనా అన్నానా?'' అంటూ ఆమె గడ్డం పట్టుకుని ''అన్నా నా! భామినీ! ఎప్పుడైనా!'' అని కూని రాగం తీశాడు కామేశం.

''అన్నానా భామినీ!'' అంటూ పాత సినిమాలు, ఫ్లాష్ బాక్‌లు గుర్తుచేస్తే ఐస్ అయిపోతాననుకోకండి. మీ మిత్రుడు రానివ్వండి. అసలు విషయం తేలుస్తాను'' అంది అపరకాళిలా.

'లాభం లేదు. ఈవేళ ఈవిడ చేతిలో అయిపోతాను' అనుకోగానే పచ్చి చింతపండు, మామిడి అల్లం ఒకేసారి కసకసా నమిలినట్లనిపించి ముందు, ''ఓ గ్లాసుడు మంచి నీళ్ళియ్యి'' అన్నట్లు శ్రీమతికి సైగ చేశాడు, బిత్తరపోయిన కామేశం.

(విపుల ఫిబ్రవరి 2006, జన్మదిన హాస్య వ్యంగ సంచిక)